

సోమశిలలో 10.143 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 10.143 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 366 క్యూసెక్కుల వరద చేరుతుండగా, దిగువకు 210 విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,070
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,652
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,852
సవర (8 గ్రాములు)	రూ.54,816

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.1 /27.8

జిల్లాలో బుధవారం ఉదయం పాక్షికంగా మేఘావృతంగా, సాయంత్రం వరకు పొడిగా ఉంటుంది. రాత్రి ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నూతన కలెక్టర్‌గా ఆనంద్

• కలెక్టర్ హరినారాయణన్ బదిలీ



కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్‌గా ఓ ఆనంద్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న ఎం హరినారాయణన్‌ను బదిలీ చేసింది. గతేడాది ఏప్రిల్ 12న నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరినారాయణన్ జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. రిపోర్టింగ్ చేసుకోవాలని వెల్లడించలేదు. ఆయన స్థానంలో విశాఖపట్నం సిటీ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఆనంద్‌ను జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఆనంద్ 2016 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన ఆయన త్రివేండ్రంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో ఇంజినీరింగ్ పట్టభద్రుడు. ఆ తర్వాత ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 2018–19 గూడూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా చేరడానికి ముందు ముస్సోరిలో లాల్‌బహాదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు.

విద్యుత్ సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారు లు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకు ఇక నుంచి విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను www. apspdcl. in ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంతో పాటు ఇతర యూపీఐ యాప్స్ నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, వాలెట్, క్యాష్ కార్డు ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. అయితే నేరుగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించే అవకాశం లేదన్నారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి సదరన్ పవర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేదా www. apspdcl. in వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చని కోరారు.

27 నుంచి ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): ఐటీఐలో తొలి విడతలో భర్తీ కాని సీట్లు కోసం ఈ నెల 27వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు చేరదలచుకున్న ఐటీఐలో ఒరిజనల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 27, 28 తేదీలు, ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అవినీతికి అధికారం అండ

పొదలకూరు సబ్‌రిజిస్ట్రార్‌కు మళ్లీ రీ పోస్టింగ్

- అక్రమ రిజిస్ట్రేషన్ చేయడంతో శాఖాపరమైన విచారణ
- వాస్తవమని తేలడంతో డిప్యుటేషన్‌పై పంపిన అధికారులు
- ప్రభుత్వం మారిన వెంటనే అదే స్థానంలో జాయిన్

పారదర్శకంగా పాలన ఉంటుందని టీడీపీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. అవినీతికి తావివ్వమని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. కానీ జిల్లాలో టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు అవినీతినే ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నారు. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న అధికారిణి అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్లు ఆ శాఖ విచారణలో తేలడంతో రెండు నెలల క్రితం ఆమెను డిప్యుటేషన్‌పై నెల్లూరుకు పంపారు. ప్రభుత్వం మారిన వెంటనే రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఆమెను తిరిగి అదే స్థానంలో పోస్టింగ్‌కు పంపడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతోనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యాలయంలోనే తిరిగి పోస్టింగ్ ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రిజిస్ట్రేషన్ శాఖ అంటేనే అవినీతికి కేరాఫ్. ఆ శాఖలో కింద స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి అధికారి వరకు అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఈ శాఖలో ఉద్యోగులు, అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్న ఘటనలను దశాబ్దాలుగా చూస్తే వేళ్లపై లెక్క పెట్టవచ్చు. 99 శాతం చర్యలన్నీ ఏసీబీకి పట్టుబడిన కేసుల్లోనే ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. గత ప్రభుత్వం అవినీతి అధికారులపై చర్యలకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుసంధానం చేస్తూ ట్రోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసింది. పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతిని కూకటి వేళ్లతో పెకళించేందుకు రిజిస్ట్రేషన్లను సచివాలయాల ద్వారా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అయితే తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలతో పాటు అధికారులు సైతం తిరిగి పాత విధానానికి తెరతీస్తున్నారు.

అవినీతి అధికారిణి లీలలెన్నో..

పొదలకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 25–2లో పూర్తి విస్తీర్ణం 3.53 ఎకరాల భూమి ఉంది. ఆయా భూమి రెవెన్యూ రికార్డుల పరంగా వన్‌బీ, అడంగళ్‌లో తల్లిక నరసయ్య పేరుతో నమోదైంది. అయితే ఆ భూ యజమాని తన భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేసుకుంటున్నాడు. అయితే ఆ సర్వే నంబర్‌లోని ప్లాటును వెంకట నరసింహులుకు పిత్రార్జితంగా ఆస్తి సక్రమించినట్లుగా నకిలీ రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారు. పొదలకూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 3143/2023 గా రిజిస్ట్రేషన్ అయింది. ఈ డీల్ వెనుక భారీగానే చేతులు మారినట్లు అప్పట్లో ఆరోపణలున్నాయి. స్థానిక సబ్ రిజిస్ట్రార్ అక్రమార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. భూముల మార్కెట్ వ్యాల్యూలో తేడాలు చూపించి వసూళ్లతో పాటు రిజిస్ట్రేషన్ల సమయంలో డాక్యుమెంట్ రైటర్ల ద్వారానే ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

• గతంలో పొదలకూరుకు చెందిన శ్రీనివాసులు రెడ్డి స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేశాడు. ఆ ప్లాటు రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ రైటర్‌ను ఆశ్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వాల్యూ ప్రకారం చలానా కట్టాడు. తీరా రిజిస్ట్రేషన్ సమయంలో స్థానిక రిజిస్ట్రార్ మార్కెట్ వ్యాల్యూ పెరిగిందని చెప్పి అదనపు చార్జీ చెల్లించాలని సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ వ్యాల్యూ ప్రకారమే చలానా తీశానని చెప్పినా వినిపించుకోలేదు. సదరు డాక్యుమెంట్ రైటర్ మాత్రం అధికారితో వాదన వద్దని చెప్పి రిజిస్ట్రేషన్‌కు అదనంగా రూ.50 వేలు డిమాండ్ చేశారు. దీంతో శ్రీనివాసులురెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌కు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వ్యాల్యూ ప్రకారమే చలానా కట్టించుకోమని ఆదేశించడమతో వెనువెంటనే రిజిస్ట్రేషన్ చేసింది. ఇలా మార్కెట్ వ్యాల్యూలో తేడాలు చూపి అక్రమార్జన చేస్తున్నారు.

• పొదలకూరులోని తోడేరు రమణారెడ్డి కాలనీలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల నివేశన పట్టాలను సైతం రిజిస్ట్రేషన్ చేశారు. అందుకు తగిన ఆధారాలతో సహా జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా విచారణకు కూడా ఆదేశించని పరిస్థితి ఆ శాఖలో నెలకొంది.

అదే స్థానంలో పోస్టింగా?

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ జిల్లాలోనే అత్యంత అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణి. గతంలో ఆమె పనిచేసిన ప్రతి చోట చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లతో భూ వివాదాలు ఏర్పడి కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నాయంటే ఆమె ఏ స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారో అర్థమవుతోంది. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చినప్పటి నుంచి ఆమె చేసి అక్రమ రిజిస్ట్రేషన్లతో ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచారు. ఆమెపై వచ్చిన ఆరోపణలతో శాఖాపరమైన విచారణ జరిపించి ఉన్నతాధికారులు నెల్లూరుకు డిప్యుటేషన్ బదిలీ చేశారు. అటువంటి అధికారిణిని టీడీపీ అధికారంలోకి రావడంతో అదే అధికార పార్టీ నేతల సిఫార్సులతో అదే స్థానంలో పోస్టింగ్ తెచ్చుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ అధికారిపైనా అయినా చర్యలు తీసుకుంటే.. తిరిగి అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడం జరిగిన చరిత్ర ఇంత వరకు లేదు. కానీ అవినీతి అధికారిణికి ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానంలోనే పోస్టింగ్ ఇవ్వడం చూస్తే అధికారం అండ ఏ విధంగా ఉందో అర్థమవుతోంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

గతంలో అక్రమాలు చేసినట్లు నిర్ధారణ కావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ జరిపి డిప్యుటేషన్‌పై నెల్లూరుకు పంపారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యాలయంలోనే తిరిగి పోస్టింగ్ తెచ్చుకుని జాయిన్ అయ్యారు. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ఇటీవల కలెక్టర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధితులు ఫిర్యాదు చేశారు. గతంలో ఆమె పలు అక్రమాలకు పాల్పడి పలుమార్లు సస్పెన్షన్‌కు గురైన ఘటనలు ఉన్నాయి.

డిప్యుటేషన్‌ను డీఐజీ రద్దు చేశారు

పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ డిప్యుటేషన్‌ను డీఐజీ రద్దు చేశారు. గతంలో ఆమెపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ జరిపి పనిష్మెంట్‌గా డిప్యుటేషన్ పంపింది వాస్తవమే. ఇటీవల డీఐజీ ఆమె డిప్యుటేషన్ రద్దు చేసి తిరిగి పొదలకూరులోనే పోస్టింగ్ ఇచ్చారు.

– బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్ నెల్లూరు

ప్రమాణాలను పాటించకపోతే చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని రెస్టారెంట్లు, బార్లు కార్పొరేషన్ నిర్దేశించిన ప్రమాణాలను తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎంహెచ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. అన్నమయ్య సర్కిల్, వనంతోపు కూడలిలోని బార్ అండ్ రెస్టారెంట్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్ ట్రేడ్ లైసెన్స్, ఎన్ఓసీ, సర్టిఫికెట్లను పరిశీలించి.. వంటశాలలో మాంసాహారాన్ని నిల్వ ఉంచడంపై నిర్వాహకులను వివరణ అడిగారు. వనంతోపు కూడలిలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను గుర్తించి వాటిని నిర్వీర్యం చేసి, నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించకపోతే బార్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలోని వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ, ప్రమాణాలపై తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.



సీజ్ చేసిన నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు

న్యాయవాదుల నిరసన

నెల్లూరు (లీగల్): పాత చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో మూడు కొత్త క్రిమినల్ చట్టాలను ప్రవేశ పెట్టడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించిన అనంతరం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ దేశంలోని చాలా మంది మేధావులు కొత్త చట్టాల అమలుతో తలెత్తే పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, అబ్బాయిరెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి వరప్రసాద్, సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

• కలెక్టర్ హరినారాయణన్



అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): కుష్టువ్యాధిపై ఉన్న అపోహలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు 15 రోజుల పాటు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. సర్వేలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయమవుతుందన్నారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–6 ఏళ్లలోపు పిల్లలందరికి కుష్టువ్యాధి పరీక్షలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుష్టు వ్యాధి నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ పెంచలయ్య, అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఏ హేనాసుజన్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు ఇప్పుడు మన నెల్లూరు అపోలోలో

డా॥ మదన్‌మోహన్ రెడ్డి

MS., (Ortho), F.R.C.S (U.K.), M.D.(FRANCE)

చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్

& టీమ్

KNEE క్లీనిక్ జరుగును

07.07.2024, ఆదివారం

ఉ॥ 8.00 గం. నుంచి మ॥ 12 గం. వరకు

Knee క్లినిక్ క్యాంప్ జరుగును.



అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి

అపోలో స్పెషాలిటి హాస్పిటల్స్

ముత్తుకూరు రోడ్, నెల్లూరు. ఫోన్: 076589 27733, 83419 95737, 099631 78841

పింఛన్ హామీ తప్పెన్

- దివ్యాంగులకు బకాయిలతో కలిపి చెల్లించని పింఛన్
- కేవలం పెంచిన రూ.6 వేలే ఇచ్చిన వైనం
- మూడు నెలల బకాయిలు రూ.9 వేలు ఎగనామం

> దివ్యాంగులకు పెంచిన పింఛన్ రూ.6 వేలతో పాటు మూడు నెలలకు రూ.3 వేల చొప్పున బకాయి మొత్తం రూ.9 వేలు కలిపి రూ.15 వేలు చెల్లిస్తాం.
>
> – జూన్ 30న రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు



ఆత్మకూరు పట్టణంలో టెక్కేవీధిలో మంచానికే పరిమితమైన 29 ఏళ్ల షేక్ షాహీనా

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం పింఛన్లపై మాట తప్పింది. గత మూడు నెలల బకాయిలతో కలిపి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అయితే వృద్ధాప్యం, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల బకాయిలు ఇచ్చిన చంద్రబాబు.. దివ్యాంగుల బకాయిలు ఎగనామం పెట్టారని దివ్యాంగులు వాపోతున్నారు. ఆత్మకూరులోని టెక్కేవీధికి చెందిన, రెండు దశాబ్దాలుగా మంచానికే పరిమితమైన దివ్యాంగురాలు షేక్ షాహీనా (32)కు కేవలం రూ.6 వేలు మాత్రమే చెల్లించారు. ఆమెకు మందులకే నెలకు రూ.7 వేలకు పైగా అవుతోందని ఆమె తల్లిదండ్రులు రజియా, అహమ్మద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బోయలచిరివెళ్లకు చెందిన మరో దివ్యాంగురాలు రమాదేవి మంచానికే పరిమితమైంది. ఏళ్ల తరబడి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న ఆమెకు నెలకు మందులకే రూ.5 వేలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు ఆమె తండ్రి రాఘవయ్య తెలిపారు. దివ్యాంగుల్లో ఆశలు రేకెత్తించి, ఇచ్చిన మాట తప్పిన కూటమి ప్రభుత్వం పింఛన్ పంపిణీ సమయంలో వారి చేతిలో రూ.6 వేలు మాత్రమే పెట్టడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు మంచానికి పరిమితమైన వారికి, డయాలసిస్ బాధితులకు సైతం పెంచిన మొత్తం బకాయిలు చెల్లించలేదని, బాబుకు మాట తప్పడం పరిపాటేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బాబును నమ్మి మోసపోయామని పలువురు బాధితులు వాపోతున్నారు.

సతుకుమాటి ఇంట విషాదం



జననం : 14.02.2003 మరణం: 22-06-2024

ఉత్తరక్రియలు

మా ఇంటి వెలుగు,
మా ముద్దుల తనయుడు

సతుకుమాటి అఖిల్ రెడ్డి BBA

తేది : 22.06.2024 శనివారం అకాల మరణం చెందాడు.
కుటుంబంలో విషాదాన్ని మిగిల్చి దేవుని సన్నిధికి చేరిన
మా కుమారునికి శోకతప్త హృదయాలతో
అశ్రునయనాలు అర్పిస్తూ...
ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని
మనసారా భగవంతుని ప్రార్థిస్తూ...

తండ్రి : సతుకుమాటి సుధీర్ రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు

తేది 04-07-2024 గురువారం
ఉదయం 9.00 గం॥లకు తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలం, ఏరూరులోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

కొత్త చట్టాలు.. రెండు కేసులు

అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాలు

- నెల్లూరులో కేసుల నమోదు
- రెండూ ఆత్మహత్య ఘటనలే..



నెల్లూరు(క్రైమ్): కొత్త నేర చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీని కింద నెల్లూరులో రెండు ఆత్మహత్య కేసులు నమోదయ్యాయి. ఇండియన్ పీనల్ కోడ్–1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్–1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 కాలగర్భంలో కలిసిపోయాయి. వీటి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం–2023 చట్టాలను అమల్లో తెచ్చారు. ఇందులో ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్‌కు చోటు లభించింది. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం కల్పించారు. నేరం జరిగినట్లు రుజువైతే ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు కేసులను రెండు వారాలకు మించి ఎక్కువ రోజులు పొడిగించడానికి వీలుండదు. పోలీసు శాఖకు పూర్తి అధికారులు ఉండడంతో కేసు త్వరితగతిన పూర్తవుతుంది. కొత్త చట్టం ద్వారా దర్యాప్తు అధికారులకు అపార అధికారాలు కట్టబెట్టారని న్యాయవాదులు, బాధితులకు భరోసా, భద్రత, సత్వర న్యాయం కలుగుతుందని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన

కొత్త చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో పోలీసు అధికారులు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మన జిల్లాలో మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాగం కొంతమేర వెనుకబడింది.

చట్టంలోని ప్రధాన అంశాలు

- బాధితులు ఇకపై అందుబాటులో ఉన్న ఏ పోలీసు స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయొచ్చు. నేరం జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు నిరాకరించేందుకు వీల్లేదు. అత్యవసర, విపత్కర పరిస్థితుల్లో బాధితులు ఫిర్యాదు చేస్తే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలి. ఆ తర్వాత నేరం ఏ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిందో ఆ స్టేషన్‌కు ఎఫ్ఐఆర్ బదిలీ చేస్తారు.
- బాధితుడు నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండానే జరిగిన ఘటనపై పోలీసు అధికారిక వెబ్‌సైట్, యాప్, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పద్ధతుల్లో ఫిర్యాదులు చేయొచ్చు. అయితే మూడు రోజుల్లోగా ఫిర్యాదుదారుడు సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుపత్రంపై సంతకం చేయాలి. పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేస్తారు.
- హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉంటుంది. దీంతో దర్యాప్తులో పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుంది.
- సమన్లు నేరుగా ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చు
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు నిర్దేశిత గడువులో (60 రోజుల్లో)గా పూర్తిచేయాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్యచికిత్స అందించాల్సి ఉంటుంది.
- లైంగికదాడి కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో,వీడియోద్వారా పోలీసులు నమోదు చేస్తారు.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, 60 ఏళ్లకు పైన, 15 ఏళ్లలోపు ఉన్న బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా తాము నివసిస్తున్న చోటు నుంచే పోలీసు సాయం పొందే అవకాశం ఉంటుంది.
- బాధితులతోపాటు నిందితులకు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలును ఉచితంగా అందిస్తారు.
- అరెస్ట్ సమాచారాన్ని నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులకు తప్పనిసరిగా తెలియజేస్తారు.
- పోలీసు రిపోర్టు, చార్జ్‌షీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను రెండు వారాల్లో పొందవచ్చు.
- ఆర్గనైజ్డ్ నేరాలు, తీవ్రవాదానికి చెక్ పెట్టేందుకు శిక్షలు మరింత కఠినతరం అయ్యాయి.
- కేసుల విషయంలో కోర్టుకు హాజరుకాలేని సాక్షులను వీడియోకాల్ ద్వారా కూడా విచారించవచ్చు.
- తాజా చట్టంలో కొన్నింటికి శిక్షలు పెంచడంతోపాటు జరిమానాలు భారీగా పెంచారు. ఉదాహరణకు ఒక వ్యక్తి చేయి విరగొడితే గతంలో మూడేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా ఉండేది. ప్రస్తుతం రూ.20 వేలకు జరిమానాను పెంచారు.

కేసులిలా..

తొలిరోజు నూతన చట్టాల కింద నెల్లూరులోని దర్గామిట్ట, నవాబుపేట పోలీసుస్టేషన్లలో రెండు కేసులను నమోదయ్యాయి. ఈనెల ఒకటో తేదీ తెల్లవారుజామున ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో ఇళ్లల్లో ఫయాజ్ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి పాత చట్టాల కింద అయితే సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసు నమోదు చేసేవారు. నూతన చట్టాలు అమల్లోకి రావడంతో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నవాబుపేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ ప్రభుత్వ వైద్యురాలు జ్యోతి (38) సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాల నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారు.

జిల్లాలో..

సబ్‌డివిజన్లు	:5
సర్కిల్స్	:12
అర్బన్ పోలీసుస్టేషన్లు	:11
పోలీసుస్టేషన్లు	:53

- సీసీఎస్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్లున్నాయి
- 2,500 మందికి పైగా సిబ్బంది ఉన్నారు.

పాత చట్టాలు

భారత శిక్షా స్మృతి (ఐపీసీ)
భారత సాక్ష్యాధారాల చట్టం
భారత నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ)

కొత్త చట్టాలు

భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)
భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)
భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణా

- మూడు ట్రాక్టర్ల సీజ్



కోవూరు : సీజ్ చేసిన ట్రాక్టర్

నెల్లూరు(క్రైమ్): ఇసుక అక్రమ రవాణాపై నెల్లూరు నవాబుపేట పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. భగత్‌సింగ్‌కాలనీ సమీప పెన్నానదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని మంగళవారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీకి సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి వెంటనే అక్కడికి చేరుకుని ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. భగత్‌సింగ్‌కాలనీకి చెందిన ట్రాక్టర్ యజమానులు రఫీ, సుధాకర్‌పై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

- **కోవూరు:** వేగూరు నుంచి మంగళవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిమ్మ ఎగుమతులపై వర్షాల ప్రభావం



మార్కెట్‌లో నిమ్మకాయలు

పొదలకూరు: దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిమ్మ ఎగుమతులు పడిపోయి ధరలు దిగజారాయి. ప్రస్తుతం ధరలు రూ.4 వేల లోపే ఉన్నాయి. కిలోల వంతున పరిశీలిస్తే రూ.30 నుంచి రూ.50 లోపు పలుకుతున్నాయి. రెండురోజుల క్రితం పొదలకూరు వ్యాపారులు ఎగుమతి చేసిన కాయలు భారీ వర్షాల వల్ల ఢిల్లీ చేరుకోలేక దారిలోనే దెబ్బతిన్నాయి. దీంతో వ్యాపారులు కాయలను స్వల్పంగా ఎగుమతి చేస్తున్నారు. ఫలితంగా డిమాండ్ తగ్గి ధరలపై ప్రభావం పడింది. ఢిల్లీ మార్కెట్‌లో ధరలు ఉంటేనే ఇక్కడి మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. ప్రస్తుతం వ్యాపారులు చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

- క్లీనర్ మృతి
- 13 మంది విద్యార్థులకు గాయాలు

కావలి: కావలి మండలం ముసునూరు టోల్ గేట్ సమీపంలో ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన బస్సును లారీ ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ముసునూరు సమీపంలో ఉన్న పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులతో కావలి నుంచి పాఠశాలకు వస్తోంది. ఈ క్రమంలో రోడ్డు మలుపు తిరిగి స్కూల్ సర్వీస్ రోడ్డులోకి ప్రవేశిస్తున్న సమయంలో నెల్లూరు నుంచి ఒంగోలు వెళ్తున్న లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొంది. దీంతో బస్సు రోడ్డు పక్కనే బోల్తా పడగా క్లీనర్ చినకొండయ్య (65) అక్కడికక్కడే మృతిచెందాడు. 13 మంది విద్యార్థులు గాయపడ్డారు. వారిని వెంటనే కావలిలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పందించారు. తమ స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడం కలిచి వేసిందన్నారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరామన్నారు. పిల్లల విషయంలో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బాధితులను పరామర్శించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మహిళ ఆత్మహత్య

మనుబోలు: మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మడమనూరు ఎస్టీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల పొన్నూరయ్య భార్య శాంతి (35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరోగ్యం కుదుట పడడంలేదని ఆమె ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. బంధువులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కండలేరులో 6.321 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.321 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అడుగంటుతున్న రాళ్లపాడు

అధ్వానంగా కాలువలు

- దెబ్బతిన్న లైనింగ్
- కట్టకిరువైపులా చిల్లచెట్లు, మూసుకుపోతున్న రోడ్డు
- ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్న రైతులు

మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో వేలాది మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం ఇందులో నీరు అడుగంటింది. ప్రాజెక్ట్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది.



రాళ్లపాడు ప్రాజెక్ట్

లింగసముద్రం: రాళ్లపాడు జలాశయం పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు 25 వేల ఎకరాలు సాగులో ఉంది. ఇది నిండితే రబీలో వరి, ఖరీఫ్‌లో పత్తి పంటలను రైతులు సాగు చేస్తారు. అంతేకాకుండా సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీల నీటిని రాళ్లపాడుకు కేటాయించారు. వర్షాలు కురిసి ప్రాజెక్ట్‌కు నీరు చేరడంతోపాటు సోమశిల జలాలు కూడా ఇక్కడికి చేరితే అటు సాగుకు, ఇటు తాగునీటికి ఇబ్బంది లేకుండా పోతుంది. ఈ జలాశయం నుంచి కందుకూరు నియోజకవర్గంలో మూడు భారీ మంచినీటి పథకాల ద్వారా లింగసముద్రం, వలేటివారిపాళెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని సుమారు 150కి పైగా గ్రామాలకు ఏడాది పొడవునా తాగు నీరు అందిస్తుంటారు.

ఐదేళ్లపాటు ఇలా..

గత ఐదు సంవత్సరాలు వర్షాలు బాగా కురవడంతో ఈ ప్రాజెక్ట్ కింద వరి, పత్తి పంటలు రైతులు సాగు చేశారు. వర్షాలకు తోడు సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడుకు నీరు చేరింది. మూడేళ్లు వరి, ఒక సంవత్సరం పత్తి పంటలను రైతులు సాగు చేశారు. చివరి సంవత్సరం అరకొర వర్షాలు కారణంగా ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో నీరు చేరక పోవడంతో అధికారులు సాగుకు నీరివ్వలేదు. నిరంతరాయంగా మంచినీటిని సరఫరా చేశారు. పూర్తి నీటి సామర్థ్యం 20 అడుగులు. కాగా ప్రస్తుతం 7 అడుగుల నీరు నిల్వ ఉంది. తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటిని అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దారుణంగా..

జలాశయం కట్టపై ఇరువైపులా కొత్తపేట నుంచి తాతా హోటల్ వరకు ప్రాజెక్ట్ బంగ్లాకు వెళ్లే రోడ్డు కంప చెట్లు దట్టంగా పెరగడంతో రోడ్డు మూసుకుపోయింది. వీటి వేర్లు కట్టలోకి చొచ్చుకుపోవడంతో బలహీనపడే ప్రమాదం పొంచి ఉంది. కట్టపై చిల్లచెట్లను తొలగించిన దాఖలాల్లేవని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల్లో గడ్డి, చెట్లు దట్టంగా పెరిగి మోకాలి లోతు పూడిక పేరుకుపోయి మూసుకుపోయింది. దీంతో నీటిని విడుదల చేస్తే చివరి భూములకు అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కుడి, ఎడమ కాలువల్లో పూడికను తొలగింపుపై ప్రాజెక్ట్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. అలాగే చాలా ప్రాంతాల్లో లైనింగ్ గోడలు దెబ్బతిని కాలువ కట్టలు కోతలకు గురవుతున్నాయి. అలాగే గుడ్లూరు మండలంలోని గుండ్లపాళెం, దారకానిపాడు, వెంకంపేట, లింగసముద్రం మండలంలోని మేదరమిట్లపాళెం, చినపవని, పెదపవని గ్రామాలకు నీరు చేరడం కష్టంగా మారుతోంది. 0 కిలోమీటర్ల వద్ద ఉన్న రాళ్లపాడు, 2, 3 కిలోమీట్ల పరిధిలోని కొండాపురం మండలంలోని సాయిపేట, మక్కెనవారిపాళెం, ఇసుకపాళెం కాలువ లైనింగ్ గోడలు అధ్వానంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుని కాలువల్లో పూడిక తీయించి చివరి భూము లకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సిబ్బంది కొరత

గతంలో ప్రాజెక్ట్ వద్ద లస్కర్లు, ఎలక్ట్రీషియన్స్, గేజర్, గేట్ల ఆపరేటర్ ఉండేవారు. ప్రస్తుతం ఇద్దరు లస్కర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్ట్ పాత, కొత్త స్పిల్‌వేపై విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురై సక్రమంగా వెలగడంలేదని రైతులు చెబుతున్నారు. ఆపరేటర్ లేకపోవడంతో వర్షా కాలంలో గేట్ల నిర్వహణను లస్కర్లే చూస్తున్నారు. గేజర్ లేకపోవడంతో ప్రాజెక్ట్‌కు నీరు చేరుతున్నప్పుడు గేట్ల నిర్వహణ కష్టంగా ఉంటోంది. గేజర్ ఉంటే ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం చేరవేస్తుండడంతో గేట్ల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. సిబ్బందిని, లస్కర్లను నియమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కుడికాలువలో గడ్డితో నిండిన పూడిక



రాళ్లపాడు వద్ద దెబ్బతిన్న గోడ



రాళ్లపాడు బంగ్లాకు వెళ్లే రోడ్డు ఇలా..

సంగంలో రెచ్చిపోయిన దొంగలు

- మూడు గృహాల్లో నగదు, బంగారం చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

సంగం: మండల కేంద్రమైన సంగంలో దొంగలు రెచ్చిపోయారు. ఒకేరోజు మూడు గృహాల్లో చోరీలు జరిగాయి. రూ.1.80 లక్షల నగదు, ఐదు సవర్ల బంగారం అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. సంగం శివాజీ సెంటర్‌కు చెందిన అనుమాలశెట్టి రామారావు దంపతులు బస్టాండ్ సెంటర్‌లో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. రామారావు భార్యకు ఎనిమిది సవర్లతో చేయించిన నాలుగు బంగారు గాజులున్నాయి. సోమవారం రాత్రి నిద్రించే ముందు రెండు గాజులు తీసి వంట గదిలోని గిన్నెలో భద్రపరిచింది. బెడ్‌రూంలో భార్యాభర్తలు నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపు తీసి ఉంది. దీంతో ఆందోళన చెందిన రామారావు వంట గదిలో వెళ్లి చూడగా నాలుగు సవర్లతో చేయించిన రెండు బంగారు గాజులు రెండు, రూ.4 వేల నగదు కనిపించలేదు. దొంగతనం జరిగిందని భావించిన దంపతులు సంగం పోలీసులకు సమాచారమిచ్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది.

- సంగం బెంగళూరు బేకరి ఎదురువీధిలో నివాసముంటున్న పప్పూరు వెంకటేశ్వర్లు దంపతులు సోమవారం రాత్రి ఇంట్లో దుస్తుల కింద రూ.1.30 లక్షల నగదు, 3/4 సవర్ల బంగారు ఆభరణాలు, మరోచోట నాలుగు సవర్ల బంగారు ఆభరణాలను దాచిపెట్టి బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడ కామాక్షితాయి ఆలయానికి వెళ్లి అక్కడే నిద్రించారు. మంగళవారం ఉదయం ఇంటికి రాగా తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో భార్యాభర్తలు లోనికి వెళ్లి చూడగా నగదు, 3/4 సవర్ల బంగారం కనిపించలేదు.
- సంగంలో కృష్ణారెడ్డి కల్యాణ మండపం వాచ్‌మన్ శీనయ్య ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున తలుపుల తాళాలు పగులగొట్టి రూ.50 వేలు నగదు దోచుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అదే విధంగా సంగం రాళ్లచెలిక కొత్తూరు ప్రాంతంలో రెండు గృహాల్లో తలుపుల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన ఘటనలు వెలుగు చూశాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.50
సన్నవి	రూ.30
పండ్లు	రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	130	బ్రాయిలర్ స్కిన్‌లెస్	260
లేయర్ (లైవ్)	115	లేయర్ చికెన్	195
బ్రాయిలర్ చికెన్	234		

పోలేరమ్మ ఆలయ హుండీ కానుకల లెక్కింపు నేడు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయం హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతకోటలోని శ్రీరామ మందిరంలో ఉదయం నుంచి లెక్కింపు ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలియజేశారు.

రైలు ఢీకొనడంతో..

- గుర్తు తెలియని వ్యక్తి మృతి

తడ: మండల పరిధిలోని అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపంలో గ్రద్ధగుంట కాలనీ వద్ద మంగళవారం రైలు ఢీకొని సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. తెలుపు రంగు చొక్కా, ఎరుపు రంగు పంచె ధరించి ఉన్నాడు. అతని వద్ద పసుపు రంగు గుడ్డ సంచి ఉండడంతో తమిళనాడుకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2155]

REAL ESTATE
నవాబుపేట, మైపాడుగేట్ సెంటర్ దగ్గరలో మినిగేటెడ్ గల 18అం॥ స్థలంగా కాని లేదా ఇల్లులు కట్టించి అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 83093 04379. [NA-23522]

PLOT FOR SALE
రాజధాని గుంటూరు విజయవాడలో 15 వెంచర్లలో CRDA ప్లాట్స్ పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్‌మెంట్స్ పొలాలు మీకు అందుబాటు ధరలలో కలవు. సంప్ర॥ ✆ 93904 51999 [O-793717]

SERVICES

BUSINESS OFFER
లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

HOSTEL
Decent Paying Guest Accomodation For PG Girls. Van Facility Available. Contact: 90108 37718, 83408 18810. [NA-11145]

TOURS & TRAVELS
వాడపల్లి,అయినవోలు,బిక్కవోలు,గొల్లలామామిడాల, గాధరాడ, పెనుకొండ, మురమళ్ళ తేది 12-7-24, 2రోజులు టి 1కి 3250/-(బస్సు రూం+భో|కె.వాసు, నెల్లూరు. 9491340504. [NA-23569]

కార్తీకమాసంలో కాశీ, అయోధ్య, నైమిశారణ్యం చిత్రకూటం,అలహాబాద్,వింధ్యాచలం,సీతామఢి, గయ, బుద్ధగయ తేదీ తేది 14-11-24,10రో॥ టిక్కెటు 1కి 18,000/-(బస్సు, రూం+భోజనం). కె.వాసు, నెల్లూరు. సంప్ర: 94913 40504. [NA-23549]

WANTED
ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217 [M-1185233]

KTM బైక్ షోరూం నందు పని చేయుటకు అనుభవం గల సర్వీస్ అడ్వైజర్స్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. బయోడేటాతో సంప్ర: HDFC బ్యాంక్ ఎదురు, వేదాయపాళెం.NLR 70135 69269. [NA-611]

నెల్లూరు, హరనాథపురం మెయిన్ రోడ్‌లో AMR పెట్రోల్ బంకు నందు డే & నైట్ షిఫ్ట్‌లో పని చేయుటకు యువకులు కావలెను. జీతం: 13,000/-.సంప్ర:8985264143, 9494797343. [NA-6493]

Reach Rich Life Company నందు పని చేయుటకు ప్రమోటర్స్ కావలెను. Full time or Part Time. నెలకి శాలరీ: 20,000/-. సంప్రదించండి: 89856 96117, 63034 03389. [NA-11146]

ఆన్‌లైన్ & జిరాక్స్ సెంటర్ యందు పని చేయుటకు పు/స్త్రీ-2 కావలెను. Qualification : Inter to PG, VRC Centre, నెల్లూరు. సంప్రదించండి:77995 14388. [N-1246181]

ఫెయిత్ డా॥ రమణి, BPT, MIAP, 10th చదివిన అమ్మాయిలు, ఫిజియో అసిస్టెంట్లుగా, ఆయా కావలెను. మధురా స్వీట్స్ ఎదురు వీధి, బృందావనం2వ వీధి,నెల్లూరు.92464 65433. [NA-23577]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185254]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్సను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

LOST
I, CHANDRA RAJA S/o. CHANDRA BHASKAR, Residing at 28-9-756, Petrol bunk Down, Venkateswara puram, Nellore, SPSR Nellore Dt, AP. I have lost my Passport bearing No. M4333262 While travelling to by bike Santhapeta.

కష్టలెస్ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 8317512135 [HA-323]

ప్రముఖ పాలిటెక్నిక్ కాలేజి నందు Electronics & Communications,Computer Science, Electrical & Electronics, Mechanical Depts నందు B.Tech అర్హత కలిగిన Teaching Faculty కావలెను. వివరములకు సంప్రదించండి: 99123 42089, 85006 63444. [NA-23576]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.